క్లుప్తంగా

ఉరవకొండ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఈరమ్మ



ఉరవకొండ: ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఈరమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విడపనకల్లు తహసీల్దార్‌గా ఉన్న ఈమెకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందితో సమావేశం అయ్యారు.

కేజీబీవీ సందర్శన



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ నాగమణి

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పట్టణంలోని కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని బుధవారం మండల విద్యాశాఖాధికారి నాగమణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మీతో కలిసి విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందుతోందా అంటూ ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈసారి జిల్లాలోనే టాపర్స్‌గా నిలిచేందుకు సాధన చేయాలన్నారు.

హజ్ యాత్రికులకు వీడ్కోలు



ప్రత్యేక దువా నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పట్టణం నుంచి పవిత్రమైన హజ్‌యాత్ర (మక్కా, మదీనాకు వెళుతున్న యాత్రికులకు ప్రత్యేక దువాతో ఘన వీడ్కోలు పలికారు. పట్టణం నుంచి ఐదుగురు, ప్రైవేటుగా ముగ్గురు బయల్దేరారు. జామీయా చౌక్, ఫోర్ట్‌గేట్ మసీదుల్లో ప్రత్యేక దువా కార్యక్రమంతో వారిని సన్మానించారు. ప్రయాణం సాఫీగా సాగాలని ప్రార్థించారు. బుధవారం రాత్రి బెంగళూరు ఎయిర్‌పోర్ట్ నుంచి సౌదీలోని జెడ్డా నగరానికి చేరుకుని, అక్కడినుంచి మక్కాకు వెళ్లి దాదాపు 40 రోజుల పాటు హజీల యాత్ర కొనసాగనుంది.

చదువుతోనే అభివృద్ధి సాధ్యం



పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

వజ్రకరూరు: చదువుతోనే అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆదర్శ పాఠశాల చైర్మన్ భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆదర్శ (మోడల్) స్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ మార్కులు సాధించిన గౌతమ్, అసార్ అఫ్రిన్, ఎర్రిస్వామికి నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. లక్ష్యాన్ని ఎంచుకుని నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్యామలాదేవి పాల్గొన్నారు.

ఐఏఎస్ కావడం లక్ష్యం



కుటుంబ సభ్యులతో కీర్తిశ్రీ

విడపనకల్లు: ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని ఇంటర్ ఫలితాల్లో హెచ్‌ఈసీలో 954 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన కీర్తిశ్రీ బుధవారం విలేకరులకు తెలిపింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా రూ.లక్ష నగదు, మెడల్, ప్రశంసాపత్రం అందుకోవడం సంతోషంగా ఉందని పేర్కొంది.

చిన్నముస్టూరులో 'స్వచ్ఛ భారత్'

ఉరవకొండ రూరల్: చిన్నముస్టూరు గ్రామంలో ఎంపీడీఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. 42వ జాతీయ రహదారిపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని గ్రామ సచివాలయ సిబ్బంది స్థానిక ప్రజల సహకారంతో తొలగించారు. సెక్రటరీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ

కూడేరు: స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో 'ఆర్థిక అక్షరాస్యత'పై క్విజ్ పోటీలను నిర్వహించారు. మరుట్ల-2 హైస్కూల్ విద్యార్థులు పవన్ కుమార్, చరణ్ ప్రతిభ కనబరిచారు. ప్రథమ స్థానంలో నిలిచి రూ.5 వేల నగదు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. కేజీబీవీ విద్యార్థిని ద్వితీయ, కూడేరు హైస్కూల్ విద్యార్థి తృతీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సాయికృష్ణ, బ్యాంక్ అధికారి గోవర్ధన్, హెచ్ఎం శ్రీదేవి తదితరులున్నారు.

యోగాతో ఆరోగ్యకర జీవితం



కంబదూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



సీజీ దొడ్డి ప్రభుత్వ పాఠశాలలో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు



ఉరవకొండ: బహుమతులు అందుకున్న విద్యార్థులు

రాయదుర్గం రూరల్: రోజూ యోగా సాధనతో ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమవుతుందని మండల విద్యాధికారి-2 వెంకటరమేష్ అన్నారు. మండల కేంద్రంలోని చదం గొల్లలదొడ్డి ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం అధ్యక్షతన బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రపంచదేశాలకు భారతదేశం ఇచ్చిన గొప్ప వరం యోగా అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ గోవిందప్ప, సర్పంచ్ మల్లేశప్ప, తదితరులు పాల్గొన్నారు.

• స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రఘురామమూర్తి నేతృత్వంలో ఎన్ఎస్ఎస్, వ్యాయామ విభాగాలు సంయుక్తంగా ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు నారాయణ, రామకృష్ణ, యోగా అధ్యాపకులు ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

• మండలంలోని టి. వీరాపురం కొత్త చెరువులో బుధవారం ఏపీడీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధి సిబ్బంది, కూలీలు యోగా సాధన చేశారు. కార్యక్రమంలో ఏపీఓ నీరజ, ఏపీడీ అసిస్టెంట్ దేవరాజు, ఈసీ భారతి, టెక్నికల్ అసిస్టెంట్ తిప్పయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ గోవిందు పాల్గొన్నారు.

ఉరవకొండ రూరల్: మండలంలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాకెట్ల, ఆమిద్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో యోగా నిర్వహించారు. కార్యక్రమంలో రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు పావని, వెంకటేష్ నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, సీఓ భగవాన్‌దాస్, సీహెచ్ఓ నాగరంగయ్య, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వజ్రకరూరు: స్థానిక కేవీజెడ్పీ ఉన్నత పాఠశాల, వెంకటాంపల్లి పెద్దతండాలో బుధవారం యోగా దినోత్సవం జరుపుకున్నారు. కార్యక్రమంలో సర్పంచు మోనాలిసా, ఉప సర్పంచ్ వెంకటేశ్‌నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ దీపానాయక్ పాల్గొన్నారు.

కూడేరు: చెక్‌డ్యాంల నిర్మాణంతో భూగర్భ జలాలు పెంపొందుతాయని వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ సుధాకర్ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఈశ్వరయ్య, పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ముద్దలాపురంలో జరుగుతున్న వాటర్ షెడ్ పనులను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో కలిసి యోగాసనాలు చేశారు. కార్యక్రమంలో టీఏలు రమేష్, లక్ష్మీనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యోగా చేయడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని 6 ఆంధ్ర బెటాలియన్ సీఏటీసీ-1 క్యాంప్ కమాండ్ కల్నల్ సందీప్ ముంద్రా తెలిపారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మణిపాల్ స్కూల్‌లో 1,000 మంది ఎన్‌సీసీ క్యాడెట్లతో కలిసి యోగా చేశారు. యోగాతో మానసిక ఒత్తిడి , షుగర్, రక్తపోటు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో సుబేదర్ మేజర్ సుఖ్‌దేవ్ పాల్గొన్నారు.

ఉరవకొండ: యోగాతో మానసిక రుగ్మతలు దూరం కావడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఉరవకొండ ఆయూర్ ప్రతినిధులు, ప్రముఖ యోగా గురువులు తాడికొండ వెంకట్, నాగమల్లి ఓబుళేసు తెలిపారు. బుధవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉరవకొండ పోలీసు క్రీడా మైదానంలో సామూహిక యోగాసానాలు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి సర్టిఫికెట్లు, పతకాలను అందించారు. ఎంపీపీ చందాచంద్రమ్మ, సర్పంచ్ లలితమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, ఎస్ఐ వెంకటస్వామి, ఎంపీడీఓ చంద్రమౌళి, ఈఓ గౌస్ సాహెబ్, ఆయుర్వేదిక్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ షఫీ, ఉరవకొండ, వజ్రకరూరు ఎంఈఓలు ఈశ్వరయ్య, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

కుందుర్పి: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని స్థానిక జూనియర్ కళాశాల, గురుకుల పాఠశాల ప్రిన్స్‌పాళ్లు కృష్ణమూర్తి, శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం అంతరాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థుల చేత యోగాసనాలు చేయించారు. ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు నిర్వహిస్తున్న 16 విలువల బడుల్లోనూ యోగాసనాలు చేయించారు. ట్రస్టు వ్యవస్థాపకులు లెనిన్‌బాబు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: రోజూ విధిగా యోగా చేసి ఆరోగ్యం కాపాడుకోవాలని ఆర్టీసీ డీఎం రామచంద్ర సిబ్బందికి సూచించారు.అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ సిబ్బందితో యోగాసనాలు వేయించారు. అనంతరం బదిలీపై ఉరవకొండ డిపోకు వెళ్లిన ఆర్టీసీ సెక్యూరిటీ కానిస్టేబుల్ ఆంజినేయులను సత్కరించారు.

విడపనకల్లు: మండల పరిధిలోని పాల్తూరు జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో విద్యార్థుల చేత యోగాసనాలు వేయించారు. ఈ సందర్భగా పీడీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. రోజు యోగా చేయడం వల్ల మాసిక రోగాలు దూరం అవుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సర్వమంగళం పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

కంబదూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అవగహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం సాయికృష్ణ మాట్లాడుతూ రోజూ క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా ఏకాగ్రతతో పాటు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల చేత యోగాసనాలను వేయించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ రామకృష్ణ, పీఈటీ లలితమ్మ, యోగా మాస్టర్ రాజేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఈఓఆర్డీ వెంకటనాయుడు, ఎంఈఓ ఓబుళపతి అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో ఏఓ నందకిశోర్, పాఠశాల సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: యోగాతో ఆరోగ్యంగా ఉండొచ్చని పిరమిడ్ ఆర్గనైజర్ మహాదేవీ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఎస్వీజీఎం డిగ్రీ కళాశాల విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. తర్వాత వివిధ యోగాసనాలను విద్యార్థుల చేత వేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జయరాంరెడ్డి, పీఎల్ కాంతరావు, అధ్యాపకులు జీఎల్ఎన్ ప్రసాద్, పీడీ నగేష్, పరమేష్, అంజన్‌రెడ్డి, రుక్మిణిదేవీ తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: యోగాతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఎంఈఓ శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈఓఆర్డీ రఘురామరాజు, డీడీఓ వ్యాసరావు హాజరయ్యారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల చేత యోగాసనాలు వేయించారు. హెచ్ఎం ఫిరోజ్ ఖాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న ఉపాధి కూలీలు, సిబ్బంది

గుమ్మఘట్ట: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఉపాధి ఏపీఓ సురేశ్ తెలిపారు. మండలంలోని నేత్రపల్లి సమీపంలో ఉన్న చెరువులో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఉపాధి కూలీలతో కలిసి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. శారీరక, మానసిక వికాసానికి యోగా ఎంతగానో తోడ్పడుతుందన్నారు. రోగనిరోధక శక్తి మెరుగవడం ద్వారా వ్యాధులను తట్టుకోగల శక్తి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఈసీ అంజన్‌కుమార్, టీఏ మల్లికార్జున, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'జగనన్న సురక్ష'

• అధికారులకు విప్ కాపు దిశానిర్దేశం



కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

రాయదుర్గం: ఎక్కడి సమస్యలకు అక్కడే పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శ్రీకారం చుట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. జులై 1 నుంచి సచివాలయాల వద్ద నిర్వహించే ప్రత్యేక క్యాంపులను అర్హత కలిగిన వారంతా సద్వినియోగం చేసుకునేలా ఉద్యోగులు, వలంటీర్లు చొరవ చూపాలన్నారు. బుధవారం నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలతో విప్ ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమం గురించి ప్రజలకు వివరించి సద్వినియోగం చేసుకునులా చైతన్యం తీసుకురావాలన్నారు. 11 రకాల ఉచిత సేవలను రాష్ట్ర ప్రభుత్వం చేరవేస్తోందనే విషయం తెలియజేయాలన్నారు. త్వరలో సమావేశం నిర్వహించి కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. తాను కూడా భాగస్వాముడినవుతానని చెప్పారు. పార్టీలకు అతీతంగా న్యాయం చేకూర్చేలా కృషి చేద్దామని వివరించారు.

నేటి నుంచి నీటి సరఫరా

రాయదుర్గంటౌన్: డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హెచ్చెల్సీ తాగునీటి పథకం నుంచి నీటి సరఫరా ఇక నుంచి మరింత మెరుగు కానుంది. రూ.50 లక్షల విలువైన నూతన ఐదు మోటార్లకు గాను మూడు మోటార్లు, పంపుల ఏర్పాటు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తయ్యాయి. కణేకల్లులోని ఆలూరు, క్రాసింగ్ వద్ద రెండు చోట్ల లీకేజీ మరమ్మతులు కూడా పూర్తి కావడంతో గురువారం నుంచి పట్టణంలో నీటి సరఫరాను పునరుద్ధరించనున్నట్లు కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. కణేకల్లులోని నీటి సరఫరా మార్గంలో వచ్చే ఫిల్టరేషన్ పాయింట్‌లో 60 హెచ్‌పీ మోటారు, వీరాపురం పంప్‌హౌస్‌లో 100 హెచ్‌పీ మోటారు, ఎస్ఎస్ ట్యాంకులో 120 హెచ్‌పీ కెపాసిటీ గల మోటార్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మరో రెండు మోటార్లను కణేకల్లులోని ఎస్ఎస్ ట్యాంకు వద్ద రా వాటర్ పంపింగ్ కోసం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి చొరవతో విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేశామన్నారు. నూతన మోటార్ల పంపింగ్‌తో పట్టణంలోని జీఎల్ఎస్ఆర్‌లకు నీటి సరఫరాలో అంతరాయం ఉండదని, మోటారు మరమ్మతుకు గురైతే పాత మోటార్లు స్టాండ్‌బైగా అందుబాటులో ఉంటాయన్నారు.

ఏసు మార్గం అనుసరణీయం



మాట్లాడుతున్న కాపు భారతి

కణేకల్లు: ఏసు ప్రభువు మార్గం అనుసరణీయమని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి పేర్కొన్నారు. కణేకల్లులోని బండియమూలలో నూతనంగా నిర్మించిన అంత్యకాలపు ప్రార్థన (చర్చి) మందిరము ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం జరిగింది. చర్చి ఫౌండర్ రెవరెండ్ సీ.జాషువ, డాక్టర్ రఘునాథ్ డానియేల్ (అనంతపురం), దైవ సేవకులు డాక్టర్ ప్రభాకర్ (కర్నాటక) అయ్యలతో కలిసి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి చర్చిని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటైన సభలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరు ప్రభువు ప్రవచనాలు, సూక్తులను ఆచరించాలన్నారు. చర్చి ఫౌండర్ రెవరెండ్ జాషువ మాట్లాడుతూ చర్చి నిర్మాణానికి అవసరమైన స్థలం కోసం విప్ కాపు రామచంద్రారెడ్డిని సంప్రదించగా ఆయన వెంటనే స్పందించి స్థలాన్ని మంజూరు చేయించారన్నారు. మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచు దంపతులు ఫోరెన్స్ నిర్మల, డాక్టర్ సోమన్న, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు మారెంపల్లి మారెన్న, కణేకల్లు మండల వైఎస్సార్‌సీపీ కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు అంబాపురం భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

గుమ్మఘట్ట: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డీఎల్‌డీఓ శంకర్ తెలిపారు. మండలకేంద్రంలోని పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు , ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు- నేడు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై దృష్టి సారించాలన్నారు. అంతకుముందు 75 వీరాపురం, పూలకుంట గ్రామాలలో జరుగుతున్న నాడు నేడు పనులు, గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ కేర్‌సెంటర్ల భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, మండల ప్రత్యేకాధికారి రాంమోహన్ రెడ్డి, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఈఓ నాగమణి, ఈఓఆర్డీ సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శంకర్

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.వెంకటేశులు తెలిపారు. ఈ నెల 28న బుధవారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. 7వ తరగతిలో 8 ఖాళీలు (ఓసీ జనరల్ కేటగిరిలో 1, ఈడబ్ల్యూఎస్ జనరల్‌లో 1, బీసీ-డీ జనరల్‌లో 1, ఎస్‌సీ జనరల్ కేటగిరిలో 2, ఎస్‌సీ మహిళ 1, ఎస్‌టీ జనరల్‌లో 1, ఓసీ మహిళ కేటగిరిలో 1) ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. 8వ తరగతిలో బీసీ-ఈ జనరల్ కేటగిరిలో ఒక సీటు ఖాళీగా ఉందన్నారు. 9వ తరగతిలో 17 సీట్లు (ఓసీ జనరల్ 6, ఓసీ మహిళ 2, బీసీ-ఏ జనరల్ 1, బీసీ-బీ జనరల్ 2, బీసీ-బీ మహిళ 1, బీసీ-డీ జనరల్ 2, ఎస్‌సీ మహిళ 1, ఎస్‌టీ జనరల్ 1, ఎస్‌టీ మహిళ కేటగిరిలో 1 సీటు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు.

పశుబీమా సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న డీడీ వెంకటేష్

బొమ్మనహాళ్: పాడి రైతులు పశువులకు వైఎస్సార్ బీమా తప్పనిసరిగా చేయించుకొని సద్వినియోగం చేసుకోవాలని ఉరవకొండ పశుసంవర్ధశాఖ డిప్యూటి డైరెక్టర్ జి. వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం బొమ్మనహాళ్‌లోని స్త్రీశక్తి భవన్‌లో అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పశువులు, గొర్రెలు, మేకలు మరణిస్తే పశుపోషకులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీపీఎల్ లబ్ధిదారులకు 20 శాతంగా, ఏపీఎల్ లబ్ధిదారులకు 50 శాతంగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గరిష్టంగా ఒక కుటుంబానికి 5 గేదెలకు, 50 గొర్రెలు, మేకలు, పందులకు బీమా చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కణేకల్లు ఏరియా పశువైద్యాశాల ఇన్‌చార్జి నాంచారయ్య, బొమ్మనహాళ్, యర్రగుంట్ల పశువైద్యాధికారులు వెంకట్‌రెడ్డి, మృదుల, వెటన్నరీ అసిస్టెంట్లు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

కళ్యాణదుర్గం: బ్రహ్మసముద్రం మండలం ఎర్రకొండాపురంలో బుధవారం పొలం హద్దుల విషయమై ఇరు వర్గాల మధ్య గొడవ జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. గొల్ల మల్లికార్జున, రవి 16 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. కొనుగోలు సమయంలోనే ఇద్దరు తూర్పు, పడమర కొలతలు వేసుకుని హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. అయితే బుధవారం రవి, నాగరాజు, శివారెడ్డి, కృష్ణమూర్తి, చిత్ర లింగ, రాజన్న, కెంచమ్మ, గిడ్డెమ్మలు తమకు ఉత్తర దక్షిణ హద్దులు ఏర్పాటు చేసి కొలతలు కొత్తగా వేయాలంటూ మల్లికార్జునకు వచ్చిన పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నారు. దీంతో మల్లికార్జున కుటుంబ సభ్యులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. రవి తరఫున వచ్చిన వారు కర్రలు, ఇనుప కడ్డీలతో మల్లికార్జునపై దాడికి దిగారు. అడ్డు వచ్చిన మల్లికార్జున సోదరులైన చిత్తప్ప, రామన్న, ఈరన్నపై సైతం దాడికి దిగి గాయపరిచారు. గాయపడిన వారిని వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మల్లికార్జున, ఈరన్నకు బలమైన గాయాలు కావడంతో అనంతపురం తరలించారు. బ్రహ్మసముద్రం పోలీసులు కేసు నమోదు చేశారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

రాయదుర్గం రూరల్: నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని ఏడీఏ లక్ష్మానాయక్ హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం రాయదుర్గం, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్ మండలాల్లోని ఫర్టిలైజర్స్ డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. డీలర్లు స్టాక్ రిజిస్టర్లు, ఈ పాస్ మిషన్లు అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులకు సంబంధించిన సోర్స్ సర్టిఫికెట్లు, ఓఫాన్స్, ప్రిన్సిపాల్ సర్టిఫికెట్లు ఉండాలని, లేనియెడల వాటిని విక్రయించరాదని తెలిపారు. లూజుగా విత్తనాలు విక్రయించరాదన్నారు. రైతులు మందులు కొనుగోలు చేస్తే తప్పని సరిగా బిల్లులు పొందాలన్నారు. జీఎస్టీ పడుతుంది, ఒరిజనల్ బిల్లుతో కావాలంటే ధర ఎక్కువవుతుందని చెబితే రైతులు మోసపోవద్దన్నారు. ఏఓ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు వాహనాల వేలం

కంబదూరు: స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం ఉదయం 10:30 గంటలకు వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.రూ.3 వేలు డిపాజిట్ చేసి పాల్గొనాలని పేర్కొన్నారు.

షిర్డీసాయి భక్తుల భిక్షాటన

వజ్రకరూరు: మండల కేంద్రంలోని షిర్డీసాయి ఆలయంలో జూలై 3వ తేదీ గురు పౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని బుధవారం భక్తులు భిక్షాటన చేపట్టారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో షిర్డీసాయి చిత్ర పటాన్ని కొలుదుదీర్చి ఊరేగించారు. భక్తులు స్వచ్ఛందంగా బియ్యం, బేడలు, బెల్లం తదితర వాటిని సమర్పించారు.

బెళుగుప్ప ఎంఈఓ-2గా హరికృష్ణ

బెళుగుప్ప: మండల విద్యాశాఖాధికారి-2గా హరికృష్ణ ప్రభుత్వ బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఎంఈఓ-1 మల్లారెడ్డి, ఉపాధ్యాయులు నూతన ఎంఈఓను సన్మానించారు.

వజ్రకరూరు: విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఎంఈఓ-2 తిమ్మప్ప తెలిపారు. బుధవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంఈఓను సన్మానించారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

కళ్యాణదుర్గం: కుందుర్పి మండలం రుద్రంపల్లిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన మల్లికార్జున పొలం నుంచి బైక్‌పై ఇంటికి వస్తుండగా కుక్క అడ్డు వచ్చింది. బైక్ అదుపు కిందపడటంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు.

దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం: పట్టణంలోని ఆదర్శ పాఠశాలలోని 7, 8, 9వ తరగతుల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం అర్హులైన విద్యార్థులు ఈనెల 24 లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్‌తో పాటు ఒక పాస్ ఫొటో, సెల్ నంబర్‌ను ఆదర్శ పాఠశాలలో అందజేయాలని సూచించారు. విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు

కూడేరు: 2023-24 విద్యా సంవత్సరంలో మండల వ్యాప్తంగా పది విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపడతామని మండల విద్యాధికారి-2 సాయి కృష్ణ పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో పిల్లల నమోదు సంఖ్య పెరిగేలా కృషి చేస్తానన్నారు. అన్ని పాఠశాలలను పర్యవేక్షిస్తానని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా చూస్తామన్నారు.

పశుబీమా సద్వినియోగం చేసుకోండి

కుందుర్పి: వైఎస్సార్ పశుబీమాను సద్వినియోగం చేసుకోవాలని పశుశాఖ ఏడీ నాగలింగారెడ్డి పాడి రైతులకు సూచించారు. బుధవారం కరిగానిపల్లిలో పశువిజ్ఞాన బడి నిర్వహించారు. పాడి పెంపకానికి ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలు, బీమా,రోగాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి,సర్పంచ్ మల్లికార్జున, పశువైద్యుడు ప్రసాద్ పాల్గొన్నారు.

'కుష్ఠు' నిర్మూలనకు సహకరించండి

బొమ్మనహాళ్: కుష్ఠు వ్యాధి నిర్మూలనలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతాభార్గవి అన్నారు. బుధవారం మండలంలోని కొలగానహళ్లి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పర్శలేని, పాలిపోయిన, రాగివర్ణపు, దురదలేని, నొప్పిలేని, మొద్దుబారిన మచ్చలు ఉన్నవారు వెంటనే ఆస్పత్రిలో పరీక్షించుకోవాలన్నారు. చెవులు, ముఖం, కాళ్లు, చేతులు శరీరంపై బుడిపెలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రమణ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచకపోతే చర్యలు

కూడేరు: కూలీల సంఖ్య పెంచుకుండా ఏం చేస్తున్నారని బుక్కరాయసముద్రం క్లష్టర్ ఏపీడీ అనురాధ మండల ఉపాధి సిబ్బందిని ప్రశ్నించారు. బుధవారం ఆమె కూడేరు మండల పరిధిలోని జయపురం, చోళసముద్రం గ్రామాల్లో జరుగుతున్న కాలువల్లో పూడికతీత పనులు పనులను పరిశీలించారు. పి.నారాయణపురంలో పొలాల్లోకి వెళ్లే రోడ్డు పని, ఎంఎం హళ్లిలో చింత వనం చుట్టూ కంపచెట్ల తొలగింపు పనులను పర్యవేక్షించారు. అడిగిన వెంటనే పనులు కల్పిస్తున్నారా? అని కూలీలతో ఆరా తీశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సిబ్బందితో సమావేశమయ్యారు. రోజుకు 6 వేల మందికి పని కల్పించేలా టార్గెట్ ఇస్తే మీరు 2,300 మందికే కల్పిస్తే ఎలా అని ప్రశ్నించారు. కూలీల సంఖ్య పెంచని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంజినీర్ రవి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

బెళుగుప్ప: ప్రభుత్వ భవన నిర్మాణ పనులతో పాటు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల నోడల్ ఆఫీసర్ శంకరయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టిన వెంటనే శీర్పి గ్రామంలోని జగనన్న లేఅవుట్, ఎర్రగుడి గ్రామంలోని సచివాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. సచివాలయ నిర్మాణాలను వేగవంతం చేసేలా చూడాలని పీఆర్ మండల జేఈ సుధాకర్‌కు సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెద్దన్న, తహసీల్దార్ ఓబుళేసు, ఎంపీడీఓ రామచంద్రతో సమావేశమయ్యారు. జగనన్న సురక్ష పథకం విధి విధానాలను వివరించారు. ప్రతి సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష మూడు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు.

సన్మానం

బొమ్మనహాళ్: సిద్దరాంపురం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు అంజినేయులు హరేసముద్రం ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. ఆయనను బుధవారం గ్రామస్తులు శాలువ, పూలహారాలతో సన్మానించారు. కొత్తగా వచ్చిన సూర్యనారాయణ, శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. సర్పంచ్ ఆంజినేయులు, ఎంపీటీసీ వెంకటేశులు, గ్రామస్తులు అశోక్‌రెడ్డి, యువరాజు, చిన్నభీమయ్య తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: కణేకల్లు జెడ్పీ బాలుర హైస్కూల్ నుంచి బదిలీపై వెళ్లిన గౌరి శంకర్, సుధాకర్, సుబ్బారావు, లక్ష్మీనారాయణరెడ్డి, కుమార్, నిర్మలను హెచ్ఎం నరసింహులు, సహచర ఉపాధ్యాయులు సన్మానించారు.